ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం

160 మంది బాల కార్మికులకు విముక్తి

వికారాబాద్ ఎస్పీ నారాయణ రెడ్డి

వికారాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్-11 కార్యక్రమం జిల్లాలో విజయవంతమైందని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. ఏఎచ్‌టీమ్ ఇన్‌స్పెక్టర్ ఎస్కేఅన్వర్ పాషా ఆధ్వర్యంలో సబ్ డివిజన్‌ల వారీగా మూడు టీంలను ఏర్పాటు చేశామనానరు. జూలై 1- జూలై 31 వరకు నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా 160 మంది బాలలను రక్షించావన్నారు. రక్షించిన వారిలో 145 మంది బాలురు, 15 మంది బాలికలు ఉన్నారన్నారు. ఇందులో భాగంగా 20 ఎఫ్ఐఆర్‌లు, 62 ఐఆర్‌లు నమోదు చేయడం జరిగిందన్నారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్నట్లు తెలిస్తే, వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్-11 కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రత్యేక బృందాల సభ్యులను, అధికారులను ఒక ప్రకటనలో అభినందించారు.

మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



దౌల్తాబాద్‌లో పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

దౌల్తాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం దౌల్తాబాద్, బాలంపేట్, గోకఫస్లాబాద్ పాఠశాలలు, బాలంపేట్‌లో నూతనంగా నిర్మిస్తున్న పీహెచ్‌సీ, తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. బాలంపేట్‌లో కేజీబీవీలో ప్రహరీ చుట్టూ బ్లూ షీట్లను అమర్చాలని సూచించారు. గోకఫస్లాబాద్ పాఠశాలకు ప్రహరీ నిర్మాణం కోసం నివేదిక తయారు చేయాలన్నారు. నూతనంగా నిర్మిస్తున్న పీహెచ్‌సీకి అనుసంధానంగా రోడ్డును ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం దౌల్తాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. తిమ్మారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులకు గణితశాస్త్రంలో కూడికలు, తీసివేతలను బోధించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ హర్ష్‌చౌదరి, డీఈవో రేణుకాదేవి, తహసీల్దార్ గాయత్రి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో వెంకటస్వామి, పంచాయతీరాజ్ ఏఈ నాగేంద్రతో పాటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు రేషన్ కార్డు అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి

అర్హులందరికీ రేషన్ కార్డులు

» జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఐటీ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం మేడ్చల్ పట్టణంలోని జీఎన్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో 40వేల మందికి పైగా కొత్త రేషన్ కార్డులు మంజూరు విద్యార్థులు చదువుకోవడానికి నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తుందన్నారు. అలాగే రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించే దిశలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుందన్నారు. మేడ్చల్- మల్కాజ్గిరి జిల్లా అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యే దృష్టిని సారించారన్నారు. అభివృద్ధిలో జిల్లాను మోడల్ సిటీగా తీర్చి దిద్దే దిశలో చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంచినీరు, డ్రైనేజీ, రోడ్ల నిర్మాణంతో పాటు ప్రజలకు అవసరపడే అభివృద్ధి పనులను చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మహిళలకు వడ్డీలేని రుణాలు: మహేందర్‌రెడ్డి

మహిళల ఆర్థిక స్వాలంబన కోసం వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్ రెడ్డి అన్నారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వాలు చేయని విధంగా మహిళలను చేయూతనివ్వడానికి ప్రభుత్వం సిద్ధమవుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులను మంత్రి శ్రీదర్ బాబు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వజ్రేశ్ యాదవ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తుర్కఎన్కెపల్లిలో భారీ వర్షం

» ఇళ్లలోకి చేరిన వరద నీరు



పూడూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుర్కఎన్కెపల్లిలో మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. గ్రామంలోని పలు ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.



పట్టుబడిన ఇసుక లారీలు(ఫైల్)

సిండికేటుగాళ్లు!

ఇసుక ధరలకు రెక్కలు.. కృత్రిమ కొరత సృష్టిస్తూ అమ్మకాలు

ఇసుక ధరలు అమాంతం పెరిగాయి. రెండు నెలల వ్యవధిలో రెండింతలు అయ్యాయి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం సడలించిన నిబంధనలు ఇసుకాసురులకు వరంగా మారింది. కొందరు వ్యాపారులు సిండికేటుగా మారి ఇష్టారీతిన ధరలను పెంచుతున్నారు. దీనికితోడు కృత్రిమ కొరత సృష్టిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. టన్ను ఇసుక ధర రూ.1,300- రూ.1,500 వరకు ఉండేది. ఇప్పుడు ఏకంగా రూ.2,200 - రూ.2,800 చొప్పున విక్రయిస్తున్నారు. పరిగి ప్రాంతంలో ఇసుక దందా మూడు లారీలు, ఆరు ట్రాక్టర్లు అన్న చందంగా సాగుతోంది.

పరిగిలో ఇసుక అన్‌లోడ్ చేస్తున్న ట్రాక్టర్



భారీగా రేటు పెంచిన వ్యాపారులు
టన్ను ఇసుకకు రూ. 2,800
సామాన్యులు కొనలేని స్థితిలో ధరలు
మామూళ్ల మత్తులో అధికారులు
పరిగిలో జోరుగా ఇసుక దందా

పరిగి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పేరిట అనుమతితో పెద్ద వ్యాపారాన్నే చేస్తున్నారు. ఇసుక అక్రమ వ్యాపారం పరిగి కేంద్రంగా జోరుగా కొనసాగుతోంది. ఈ దందాలో వ్యాపారులు సిండికేట్‌గా మారి రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. అనుమతి లేని ఇసుక లారీలు నిత్యం పరిగి సబ్ డివిజన్‌లోని ప్రభుత్వ కార్యాలయాల ఎదుటి నుంచే తరలిపోతున్నాయి. అయినా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఇసుకను ఇళ్ల నిర్మాణాల కోసం అనుమతితో తీసుకెళ్లినా కొందరు వ్యాపారులు అడ్డుకుంటున్నారు. ఇటీవల కొందరు సిండికేటుగాళ్లు ఘర్షణలకు

మిగతా 8వ పేజీలో...



అక్రమంగా ఇసుకు తరలిస్తే చర్యలు

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎక్కడి వరకు అనుమతి ఉంటే అక్కడే విక్రయించాలి. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే సీజ్ చేస్తాం. అక్రమ ఇసుక గురించి మా దృష్టికి తీసుకువస్తే పోలీసుల సహకారంతో కేసులు పెడతాం. స్పెషల్ డ్రైవ్ చేసి చర్యలు తీసుకుంటాం.

-వెంకటేశ్వరి, తహసీల్దార్, పరిగి

స్వాతంత్ర్య దినోత్సవానికి

భారీ ఏర్పాట్లు

» మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ మను చౌదరి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య వేడుకలను తిలకించేందుకు వచ్చే వారితో పాటు ముఖ్య అతిథిలు, అధికారులు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సదుపాయాలు కల్పించాలన్నారు. పోలీస్‌ల గౌరవ వందనంతో పాటు బందోబస్తు ఏర్పాట్లు చూడాలని పోలీస్ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, మైక్, సౌండ్ బాక్సులు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులచేత దేశభక్తిని పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, కలెక్టరేట్ ఏఓ రామ్ మోహన్ పాల్గొన్నారు.

ఈ-పంచాయతీ అమలేది?

గ్రామాల్లో పడకేసిన సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ

7

ఉలిక్కిపడిన మేడ్చల్ మార్కెట్

పేలుడు బీభత్సాన్ని అడ్డుకున్న బోరుబండి
దుకాణాలు మూసే సమయంలో ప్రమాదం
ఒకరి మృతి.. ఆరుగురికి గాయాలు
ఇంకా తెలియని మృతుడి ఆచూకీ

సిలిండర్ పేలిన ఘటనతో ఆందోళన

మేడ్చల్ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సిలిండర్ పేలిన ఘటనతో మేడ్చల్ పట్టణంలోని ప్రధాన మార్కెట్ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. సోమవారం రాత్రి 9.30 గంటల సమయంలో దుకాణాలు మూసేసి ఇళ్లకు బయల్దేరే వేళ ఒక్కసారిగా పెద్ద శబ్దంతో సిలిండర్ పేలింది. దీంతో చుట్టు పక్కల అందరూ దుకాణాలు వదిలి రోడ్డుపైకి పరుగులు తీశారు. సిలిండర్ పేలడంతో మార్కెట్ మధ్యలో ఉన్న రెండు షెట్టర్లు కుప్పకూలిపోయాయి. ఆ సమయంలో అక్కడ ఓ యువకుడు రక్తపు మడుగులో తీవ్ర గాయాలతో కొన ఊపిరితో కనబడటంతో స్థానికులు సమీప ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందక ముందే అతడు మృతి చెందాడు. కూలిన భవనం శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శిథిలాల్లో చిక్కుకున్న వారిని బయటికి తీసే ందుకు ప్రయత్నం చేశారు. అప్పటికే శిథిలాల మధ్య నుంచి ఓ మహిళ అరుపులు వినిపించాయి. మరో పక్క మొబైల్ షాపు నుంచి మరో వ్యక్తి రోదన వినబడింది. వారిని బయటికి తీసి ఆసుపత్రికి తరలించారు. ఘటన తీవ్రత ఎక్కువగా ఉండటంతో

మిగతా 8వ పేజీలో...

పాలు వేడి చేసే క్రమంలో పేలుడు

పేలుడు ఘటన చోటు చేసుకున్న భవనంలో తిరుపతమ్మ అనే మహిళ ఒంటరిగా నివశిస్తోంది. సోమవారం రాత్రి పాలు వేడి చేయటానికి తన వంట గదిలో గ్యాస్‌పొయ్యి వెలిగించిన వెంటనే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు సమాచారం. సిలిండర్ పేలడంతో ఈ ఘటన చోటు చేసుకుందని ప్రాథమికంగా పోలీసులు ధ్రువీకరించారు. వంట గదిలో గ్యాస్ లైక్ కావడంతో ఈ ఘటన చోటు చేసుకుందన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



జేసీబీతో భవన శిథిలాలను తొలగిస్తున్న సిబ్బంది



ప్రాణాలతో బయట పడ్డా

దుకాణం మూసి వేసి ఇంటికి వెళ్దామన్న సమయంలో ఫోన్ రావడంతో అక్కడే ఆగి మాట్లాడుతున్న. ఆ క్రమంలో ప్రమాదం జరిగింది. రెండు నిమిషాల్లో దుకాణానికి తాళం వేసి బయటపడే వాడిని. ఈ ఘటనతో దుకాణంలోని మొబైల్స్ చెల్లాచెదురయ్యాయి. ఫర్నిచర్ ధ్వంసమైంది. అంతా క్షణాల్లో జరిగి పోయింది. శిథిలాల మధ్య ఇరుక్కు పోయాను. స్థానికుల సాయంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాను. దాదాపు రూ.8 లక్షల నష్టం జరిగింది.

-దినేశ్, మొబైల్ షాప్ యజమాని

అథ్లెటిక్స్‌లో గురుకుల విద్యార్థుల సత్తా

» 11 మంది క్రీడాకారులకు పతకాలు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అంకుశాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ డిగ్రీ(మహేంద్ర హిల్స్) కళాశాల క్రీడాకారులు అథ్లెటిక్స్‌లో సత్తా చాటారు. 3, 4 తేదీల్లో హనుమకొండలో జరిగిన 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో గురుకుల క్రీడాకారిణిలు ఏకంగా 11 పతాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ స్నేహలత తెలిపారు. 5కిలో మీటర్ల పరుగు పందెంలో ఉషారాణికి కాంస్య పతకం, చైతన్యకు రజతం, బేబీకి అండర్-17, ఐదు కిలోమీటర్ల విభాగంలో కాంస్య పతకం, అనూషకు హైజంప్‌లో కాంస్యం, సత్యకు లాంగ్ జంప్‌లో రజతం, రేవతికి డిస్కస్ త్రోలో రజతం, పూజకు జావెలిన్‌త్రోలో రజతం, అలాగే లక్ష్మి.. జావెలిన్‌త్రోలో కాంస్య పతకాలు సాధించారు. దీంతో ప్రిన్సిపాల్ పతకాలు సాధించిన క్రీడాకారిణిలను అభినందించారు. కార్యక్రమంలో పీడీలు రామలక్ష్మణ్, శేషుకుమారి, అథ్లెటిక్స్ కోచ్ భిక్షపతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మెరిట్ సర్టిఫికెట్లతో క్రీడాకారులు

పెద్దేముల్‌లో భూకంప కలకలం

» గిరిజన తండాల్లో భయం భయం

» రాత్రంతా ఆరుబయటే నిద్ర

పెద్దేముల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలో గిరిజన తండాలు ఉలిక్కిపడ్డాయి. సోమవారం రాత్రి భూకంపం వచ్చిందని భయపడి పోయారు. అక్కడి జనం రాత్రంతా ఆరుబయటనే నిద్రించారు. వివరాల్లోకి వెళ్తే పెద్దేముల్ మండలంలోని సిద్ధన్నమడుగు తండా, ఆత్కూర్, ఆత్కూర్ తండా ప్రజలు సోమవారం రాత్రి 10 గంటల నుంచి మంగళవారం ఉదయం 7 గంటల వరకు 3 - 4 సార్లు భారీ శబ్దాలు వచ్చాయని, భూమి కంపించిందన్న సమాచారంతో భయపడి పోయారు. రాత్రంతా ఆ తండాల్లోని ప్రజలకు కంటిమీద కునుకే లేదు. అది భూకంపమా లేక బ్లాస్టింగ్ శబ్దమా అని స్థానికులు చర్చించుకుంటున్నారు. అయితే స్టోన్ వ్యాపారస్థులు గనుల్లో బ్లాస్టింగ్‌లు జరిపి ఉంటారని పలువురు చర్చించడం గమనార్హం. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఎర్రగడ్డ గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. కాగా, భారీ శబ్దం వచ్చింది వాస్తవమేనని పోలీసులకు తండావాసులు వివరించారు.



విచారణ చేస్తున్న పోలీసులు

సామాజిక పింఛన్ల పంపిణీపై ఎంపీడీవోల ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాచారం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఆసరా పింఛన్ల పంపిణీ సరిగ్గా జరుగుతోందా? లేదా అనే అంశంపై గ్రామాల్లో ఎంపీడీవోలు ఆరా తీస్తున్నారు. కొత్తగా ముఖ గుర్తింపు విధానం ద్వారా పింఛన్ల పంపిణీ అంశంపై ఈ నెల 3న 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో అధికారులు స్పందించారు. ఏయే గ్రామంలో ఎంత మంది పెన్షన్‌దారులున్నారు? కొత్త విధానంలో ఎంతమందికి పంపిణీ చేశారు? అనే విషయాలను ఎంపీడీవోలు తపాలా సిబ్బందిని అడిగి తెలుసుకుంటూ జిల్లా అధికారులకు సమాచామిస్తున్నారు. అందరికీ పించన్ పంపిణీ చేయాలని సిబ్బందికి సూచిస్తున్నారు. పోస్టల్ ఉద్యోగులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పింఛన్లు పింపిణీ చేస్తున్నారు.

విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

వికారాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో విద్యారంగంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు ఎ.రాములు (టీఎస్‌యూటీఎఫ్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఉపాధ్యాయ సంఘాల ఐక్య పోరాట కమిటీ వికారాబాద్ జిల్లా స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల ప్రమోషన్లను పారదర్శకంగా పూర్తిచేయాలని, జీవో 25ను సవరించి ప్రతీ పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు, అలాగే 40మంది విద్యార్థులున్న ప్రతీ పాఠశాలలకు తరగతికో ఉపాధ్యాయుడు చొప్పున ఉండేలా చూడాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు వర్క్‌లోడ్‌కు అనుగుణంగా ఎస్‌ఏలను నియమించాలని, అన్ని పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ టీచర్ల బెనిఫిట్స్ అన్ని వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, ఏకీకృత సర్వీసు రూల్స్ రూపొందించాలన్నారు. డీఈడీ ఉన్న సీనియర్ ఎస్జీటీలకు ప్రమోషన్ కల్పించాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకాల జీతాన్ని చెల్లించాలని, కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు తీర్చాలన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. టీఎస్ యూటీఫ్ జిల్లా కార్యదర్శులు బాబురావు, పవన్‌కుమార్, శివరాజ్, బసప్ప, వికారాబాద్, ధారూర్, కోట్‌పల్లి మండలాల అధ్యక్షులు రాములు, అజయ్‌కుమార్, రాంచంద్రయ్య, నాయకులు వినోద్‌కుమార్, పరమేశ్, ప్రభాకర్, తిరుపతయ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ


సామాజిక తనిఖీ ప్రజా వేదికలో మాట్లాడుతున్న డీఆర్డీవో శ్రీలత

కందుకూర్, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి):కందుకూర్ ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ కింద చేసిన పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదికను మంగళవారం నిర్వహించారు. డీఆర్‌డీవో శ్రీలత, అడిషనల్ డీఆర్‌డీఏ సుభాషిణిల ఆధ్వర్యంలో 2024-25 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వరకు 35 పంచాయతీల్లో చేసిన పనులపై తనిఖీ నిర్వహించారు. ఈజీఎస్, పంచాయతీరాజ్, అటవీ శాఖల ఆధ్వర్యంలో చేసిన 813 పనులకు కూలీలకు రూ.6.08కోట్లు,సామగ్రికి రూ.1.9కోట్లు చెల్లించినట్టు అధికారులు తెలిపారు. పనులపై తప్పిదాలు, కొలతల్లో తేడాలు వంటి పొరపాట్లపై సిబ్బంది నుంచి రూ.16వేల రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరిత, ఏపీడీ చరణ్, విజిలెన్స్ అధికారి కొండయ్య, ఎస్ఆర్‌సీ కాశయ్య, తనిఖీ బృందం, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

మావోయిస్టులను తుదముట్టించేందుకు కేంద్రం యత్నం

● సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య


సీపీఐ తెలంగాణ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

శంషాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను హతమార్చేందుకు, మావోయిస్టు ఉద్యమాన్ని సమూలంగా అణగదొక్కేందుకు కుట్ర చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. తెలంగాణ రాష్ట్ర సీపీఐ 4వ మహాసభలు ఈ నెల 20 నుంచి 22 వరకు మేడ్చల్ జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్‌లో నిర్వహిస్తామని తెలిపారు. మహాసభల ప్రచార వాల్ పోస్టర్‌ను మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం 2026 మార్చి నాటికి మావోయిస్టులు సమూలంగా లేకుండా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటన చేయడం బాధాకరమన్నారు. కమ్యూనిజాన్ని తుడిచిపెట్టడం ఎవరి తరమూ కాదన్నారు. పార్టీ 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం అయ్యేలా చూడాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పుస్తకాల నర్సింగ్‌రావు, పానుగంటి పర్వతాలు, కె.రామస్వామి, యాదయ్య, నర్సింహ, నర్సింహారెడ్డి, సక్రు, మంజుల తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

అభివృద్ధి పనులను పటిష్టంగా చేయాలి

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లో చేస్తున్న ప్రతీ అభివృద్ధి పనిలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని, చేసిన పనులు దశాబ్దాల పాటు మన్నాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. షాద్‌నగర్ పట్టణ పరిధి ఫరూఖ్‌నగర్‌లోని నాలుగు వార్డుల్లో చేపట్టిన సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు, విద్యుత్ లైన్ల ఏర్పాటు, తాగునీటి సరఫరాకు ప్రాధాన్యమిస్తున్నట్టు తెలిపారు. ప్రతీ ప్రభుత్వ పనిలో నాణ్యత ఉండేలా అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పర్యవేక్షించాలని సూచించారు. కాంట్రాక్టర్లు నాణ్యతలో రాజీపడొద్దని కోరారు. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహాన్ని పరిశీలించారు. పాత విగ్రహం స్థానంలో కొత్తగా కాంస్య విగ్రహాన్ని తాను ఇప్పిస్తానని, అందుకు తగిన ఎత్తు, వెడల్పులతో గద్దె నిర్మించాలని నాయకులను ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్, నాయకులు జమ్ముద్, ఇబ్రహీం, ముబారక్, మురళీమోహన్, దిలీప్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కమల్ పాండేతో చర్చలు జరుపుతున్న కార్మికులు, నాయకులు

సీసీఐ కాంట్రాక్టర్‌తో కార్మిక సంఘాల చర్చలు

» కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

తాండూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కరన్‌కోట్‌లోని ప్రభుత్వ రంగ సీసీఐ కర్మాగారంలో నోటీసులు ఇవ్వకుండా ప్యాకింగ్ ప్లాంట్‌లో పని చేసే తొలగించిన 97 మంది కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు కోరారు. మంగళవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో ఏఐటీయూసీ కార్మిక సంఘం ప్రధాన కార్యాలయంలో కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరిపారు. సీసీఐ ప్యాకింగ్ ప్లాంట్ కాంట్రాక్టర్ కమల్ పాండేతో జరిగిన సంఘటనపై క్లుప్తంగా వివరించారు. కార్మికులను విధుల నుంచి తొలగించడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని నాయకులు అన్నారు. సీసీఐ కాంట్రాక్టర్ కమల్‌పాండే సీసీఐ కర్మాగారానికి వచ్చి చర్చలు జరిపి తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని పాండేకు విన్నవించారు. దీంతో ఆయన స్పందిస్తూ.. రెండు రోజుల్లో సీసీఐకి వచ్చి మాట్లాడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజ్‌కుమార్, జర్నప్ప, దస్తప్ప, తాహెర్ పాషా పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



మోడల్ స్కూల్‌లో మొక్కలు నాటుతున్న అటవీ శాఖ అధికారులు

చేవెళ్ల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ లక్ష్మణ్, డిప్యూటీ రేంజర్ రవికుమార్‌లు అన్నారు. మంగళవారం చేవెళ్లలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ.. మొక్కలు నాటి వాటిని చెట్లుగా పెంచితేనే వర్షాలు సంవృద్ధిగా కురుస్తాయన్నారు. చెట్లు నరకడం పర్యావరణానికి హాని చేసినట్టన్నారు. ప్రతీ రైతు పొలాల వద్ద, ఖాళీ స్థలాల్లో మొక్కలునాటి వృక్షాలుగా పెంచాలని సూచించారు. విద్యార్థులు తమ పుట్టిన రోజున మొక్కలు నాటి వాటికి నీరుపోసి పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిన్నపరెడ్డి, అటవీ శాఖ రిటైర్డ్ అధికారి ఎండీ.రఫీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన మెడిసిటీ విద్యార్థులు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ

మేడ్చల్ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఘనాపూర్ మెడిసిటీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో సత్తాచాటారు. స్టూడెంట్స్ నర్సింగ్ అసోసియేషన్ తెలంగాణ వారు సంగారెడ్డిలో నిర్వహించిన పోటీల్లో నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఫైనల్‌లో మెడిసిటీ విద్యార్థులు ట్రోఫీని సొంతం చేసుకున్నారు. ఈ మేరకు ట్రోఫీ దక్కించుకున్న విద్యార్థులను మంగళవారం కళాశాలలో ప్రొఫెసర్ శివరామ కృష్ణ, షేర్ మెడికల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సి.మల్లికార్జునరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ హేమవతిరాములు, కళాశాల ఫిజిక్స్ ఎడుకేషన్ డైరెక్టర్ జి.శివారెడ్డి తదితరులు అభినందించారు.



ఉత్సవాలకు ముస్తాబైన ముర్షద్ దర్గా

పెద్దేముల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముర్షద్ దర్గా ఉర్సే షరీఫ్ ఉత్సవాలకు ముస్తాబైంది. 79వ ఉర్సే షరీఫ్ ఉత్సవాలు గురువారం(రేపటి) నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ముతావలి అల్హాజ్ సయ్యద్ అబ్దుల్ గనిపాషా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7న ఇంటి నుంచి సందల్, 8న రాత్రికి దీపోత్సవం, 9-30గంటలకు ఖవ్వాలి, 9వ తేదీన నమాజ్ బాద్ ఫజర్ తిలావత్ ఖురన్‌పాక్, ఫాతే హఖ్వాని, ప్రసాద వితరణ కార్యక్రమాలుంటాయని తెలిపారు. ఉత్సవాలకు తాండూరు, పెద్దేముల్, బషీరాబాద్ మండలాల ప్రజలు, కర్ణాటక రాష్ట్రం చించోలి, గుర్మిట్‌కల్, నల్వార్, కుంచారం, మహబూబ్‌నగర్ జిల్లా కొస్గి, మద్దూర్, మహబూబ్‌నగర్ ప్రాంతాల భక్తులు రానున్నారు.

ఎమ్మెల్యే కృషితో విద్యుత్ మెటీరియల్

» ట్రాన్స్‌కో డీఈ శ్యాంసుందర్‌రెడ్డి



షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యల పరిష్కారానికి కావాల్సిన మెటీరియల్ వచ్చిందని ట్రాన్స్‌కో డీఈ సి.శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. కరెంట్ సమస్యలను పరిష్కరించేందుకు మెటీరియల్ కావాలని సోమవారం ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్.. ట్రాన్స్‌కో సీఎండీ ముషార్రఫ్ ఫరూఖ్ అలీకి ప్రతిపాదనలను ఇచ్చారన్నారు. స్పందించిన ఆయన మంగళవారం మెటీరియల్ ఇచ్చారని తెలిపారు. అందులో 72 ట్రాన్స్‌ఫార్మర్లు, 35కిలో మీటర్ల పొడవైన కండక్టర్ వైర్, స్తంభాలు వచ్చాయని తెలిపారు. మరింత కేబుల్ వైరు వస్తుందని చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన 24గంటల్లోనే మనకు పెద్దమొత్తంలో మెటీరియల్ రావడం గొప్ప విషయం అని అన్నారు. ఇక నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు తీర్చి ప్రజలకు సౌకర్యాలను పెంచుతామని శ్యాంసుందర్‌రెడ్డి వివరించారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

» సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల నాయకులు మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో వంశీచంద్‌రెడ్డిని కలిశారు. ప్రభుత్వ పథకాల అమలు, పార్టీ బలోపేతం, స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించకుండా కాలయాపన చేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు తప్పక ఉంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు అంతా సన్నద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు, ప్యాక్స్ డైరెక్టర్ చేగురి వెంకటేశ్, నాయకులు పాలకూర్ల రాములు, కానుగుల దశరథం, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంచాయతీ అమలేది?

- గ్రామాల్లో పడకేసిన సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ
- మండల పరిషత్ నుంచే నిర్వహణ
- మండల కేంద్రానికి వెళ్లలేక గ్రామీణుల ఇబ్బందులు



దేవరఫస్లాబాద్ పంచాయతీ కార్యాలయం

దౌల్తాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ప్రజలకు సేవలను మరింత మెరుగ్గా, వేగవంతంగా అందించేందుకు ప్రభుత్వం ఈ-పంచాయతీ(ఎలక్ట్రానిక్ పంచాయతీ) విధానాన్ని ప్రవేశపెట్టింది. ప్రజలకు అవసరమయ్యే కొన్ని సర్టిఫికెట్లను గ్రామంలో అందించడమే ఈ కార్యక్రమ ఉద్దేశం. ప్రారంభంలో కొన్ని పంచాయతీలకు ఆపరేటర్లను నియమించి కంప్యూటర్లను అందించారు. అయితే కొన్ని పంచాయతీల్లో ఆపరేటర్లు లేక సేవలంద లేదు. కొన్నాళ్లపాటు ఆపరేటర్లు ఉండి కంప్యూటర్లు ఏర్పాటు చేసిన చోట నుంచి క్లస్టర్లుగా విభజించి సేవలందించారు. రానురాను కార్యక్రమం మూలన పడింది. ప్రస్తుతం పంచాయతీ కార్యాలయాల్లో సర్టిఫికెట్లు, ఆన్‌లైన్ సేవలేవీ అందించడం లేదు. మొత్తం మండల కేంద్రం నుంచే ఆపరేట్ చేస్తున్నారు. కాగా దౌల్తాబాద్ మండలంలో మొత్తం 32 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామాల ప్రజలు ప్రతీ పనికి మండల పరిషత్ కార్యాలయానికి వెళ్తున్నారు.

పంచాయతీకో టీ-ఫైబర్

ఈ-పంచాయతీ పాలన అమలుకు కార్యాలయాల్లో కంప్యూటర్ ఉండాలి. గతంలో ప్రభుత్వం ఇంటింటికి ఇంటర్నెట్ కనెక్షన్ ఇచ్చేందుకు మిషన్ భగీరథ పైపులైన్‌తో పాటే టీ-ఫైబర్ లైన్ కేబుల్ వేశారు. పంచాయతీ కార్యాలయాల్లో టీ-ఫైబర్ సర్వర్ బాక్సులను ఏర్పాటు చేశారు. కానీ అన్ని పంచాయతీలకు కంప్యూటర్లు సరఫరా చేయలేదు. కొన్ని పంచాయతీల్లో బిగించినా వాటిని కూడా మండల పరిషత్ కార్యాలయాలకు తరలించి అక్కడి నుంచే సేవలందిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయాల నుంచే ఆన్‌లైన్ సేవలందిస్తున్నారు. కొన్నాళ్లపాటు మండలానికి రెండుమూడు క్లస్టర్లను ఏర్పాటు చేసి పెద్ద పంచాయతీల్లో ఆపరేటర్లను నియమించి క్లస్టర్ పరిధి పంచాయతీల ప్రజలకు సేవలందించారు. ప్రస్తుతం అక్కడ సైతం తొలగించి ఎంపీడీవో ఆఫీసులోనే పనిచేస్తున్నారు. మొత్తానికి 'ఈ-పంచాయతీ' కార్యక్రమాన్ని గ్రామాల్లో అమలు చేయడం లేదు. దీంతో ప్రజలు ఎప్పటి లాగానే పనుల కోసం మండల కేంద్రానికొచ్చి ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో కొన్ని రకాల సేవలందించాలనే సదాశయాన్ని నీరుగార్చారు.

అందుబాటులో సమస్త సమాచారం

ప్రతీ పంచాయతీకి అందించే ఈ-సేవలతో గ్రామాల్లో మెరుగైన పౌర సేవలు అందించేందుకు వీలవుతుందని ప్రభుత్వం భావించింది. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, వివాహాల నమోదు, ఉపాధి జాబ్ కార్డుల జారీ, రేషన్ కార్డులు, పెన్షన్లు, మరుగుదొడ్ల కోసం దరఖాస్తుల స్వీకరణ, వృత్తి, వ్యాపార లైసెన్స్‌ల జారీ వంటి సేవలను ఈ-పంచాయతీల ద్వారా అందించాలి. దీనికి తోడు పన్ను వసూళ్లు, సామాజిక పెన్షన్లు, గ్రామ సమాచారం, ప్రణాళికలు, పలు అనుమతులు, గ్రామ సభల నిర్వహణ తదితర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు వంటివి ఈ-పంచాయతీ లక్ష్యం. దీని ద్వారా గ్రామ సమాచారం పారదర్శకంగా, కచ్చితంగా వెంటనే లభ్యమవుతుందని ప్రభుత్వం దీన్ని అమలు చేసింది. కార్యక్రమ నిర్వహణపై అధికారులకు, పాలకులకు శ్రద్ధ లేకపోవడంతో మూలనపడింది. అన్ని పంచాయతీల్లో ఇంటర్నెట్ కనెక్షన్‌తో కంప్యూటర్‌ను అమర్చి, ఆపరేటర్లను నియమిస్తే ప్రజలకు మెరుగైన సేవలంది ప్రభుత్వ ఆశయం నెరవేరే అవకాశం ఉంది.

ప్రభుత్వ కార్యక్రమాలను అడ్డుకోవద్దు

» రేషన్ కార్డుల పంపిణీ సభలో మంత్రి శ్రీధర్‌బాబు



సభలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

పహాడిషరీఫ్, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల ద్వారా ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం నెలకు సగటున రూ.1,200 విలువైన ఉచిత బియ్యాన్ని అందిస్తోందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం మల్లాపూర్‌లోని వైఎఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. ప్రొటోకాల్ పేరుతో కొందరు రభస సృష్టిస్తున్నారని, పేదలకు మేలుచేసే ప్రభుత్వ కార్యక్రమాన్ని అడ్డుకోవడం సరికాదన్నారు. అనంతరం రేషన్ కార్డులు పంపిణీ చేసి వారితో సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, కందుకూరు ఆర్డీవో రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. కాగా కార్డుల పంపిణీలో ప్రొటోకాల్ పాటించడం లేదని, ఇది కాంగ్రెస్ పార్టీ కార్యక్రమా? అని ఎమ్మెల్యే సబితారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు వేదికపైకి రావడంతో ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం తెలిపారు. రెండు పార్టీల నాయకులు పరస్పరం నినాదాలు చేశారు. కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నానని సబితారెడ్డి వెళ్లిపోతుండగా పోలీసులు బీఆర్ఎస్ నాయకులను, జర్నలిస్టులను బయటకు పంపించారు. ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు మంత్రితో కలిసి వేదికపైకి రావడం ప్రొటోకాల్‌కు వ్యతిరేకమన్నారు. పోలీసులు బీఆర్ఎస్ కార్యకర్తలను బయటకు నెట్టారని, ఏసీపీ తనపట్ల దురుసుగా ప్రవర్తించాడని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పాలనలో ప్రతీ కుటుంబానికి న్యాయం

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో ప్రతీ పేద కుటుంబానికి మేలు జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సామాజిక న్యాయం, పేదల ఆర్థికాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం అన్నారు. కడ్తాల మండలం చల్లంపల్లికి చెందిన ఇద్దరికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే హైదరాబాద్‌లోని తన నివాసంలో అందజేశారు. అభివృద్ధి పనులపై గ్రామనాయకులతో చర్చించారు. అర్హులందరికీ పథకాలను వర్తింపజేస్తున్నామన్నారు. ఆమనగల్లులో రూ.17.5కోట్లతో నూతన ఆస్పత్రిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. కడ్తాలలో త్వరలో 30పడకల ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు చల్లా సురేందర్ రెడ్డి, పోతుగంటి అశోక్, నాయిని నరేందర్, గణేశ్‌గౌడ్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, కాసు శ్రీనివాస్‌రెడ్డి, జగన్, నర్సింహ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



తూంకుంట పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

శామీర్‌పేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను, పరిశుభ్రతతో కూడిన భోజనాన్ని అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా టీచర్లను, అధికారులను ఆదేశించారు. మంగళవారం తూంకుంట మునిసిపాలిటీ పరిధి సింగాయిపల్లి, తూంకుంటల్లో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. మొదట తూంకుంట పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించి అందిస్తున్న భోజనం, బోధిస్తున్న విద్యపై అడిగి తెలుసుకున్నారు. బోధిస్తున్న పాఠాలను నిత్యం శ్రద్ధగా చదవాలని సూచించారు. మెనూ ప్రకారం పిల్లలకు నాణ్యమైన భోజనం అందేలా చూడాల్సిన బాధ్యత హెచ్ఎం, టీచర్లపై ఉందని చెప్పారు. ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అదనపు కలెక్టర్ సింగాయిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి చిన్నారులతో ముచ్చటించారు. ఈ కేంద్రంలో ఏమైనా సమస్యలున్నాయా? అని టీచర్ జమునను అడిగారు. పిల్లలకు పౌష్టికాహారాన్ని, గుడ్లు సక్రమంగా సరఫరా అవుతున్నాయా? అని అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠానలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లోని శివ మారుతి గీతా అయ్యప్ప ఆలయంలో మంగళవారం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులు సొంత ఖర్చులతో 12.6పీట్ల ఎత్తు ఉన్న ఆంజనేయస్వామి విగ్రహాన్ని తెప్పించి ప్రతిష్ఠించారు. వేద పండితులు ఆంజనేయస్వామి విగ్రహంతో పాటు దేవసేనవలి సమేత సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించిన భక్తులకు తీర్థప్రసాదాలను ఇచ్చారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొప్పుల మదన్మోహన్‌రెడ్డి, వీహెచ్‌పీ సేవా ప్రముఖ్ బండారి రమేశ్, కమ్మ సేవా సంఘం అధ్యక్షుడు పాతూరి వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

» జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ

మూడుచింతలపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయధికారి చంద్రకళ అన్నారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఉద్ధమర్రిలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో జీవామృతంతో సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది పైరు ఏపుగా పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల భూమిలో సారం పెరుగుతుందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకట్‌రాం రెడ్డి, మండల వ్యవసాయధికారి రవికుమార్, శాస్త్రవేత్తలు మధుశేఖర్, దిలీప్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మూగ జీవాలకు మెరుగైన వైద్యమందించాలి

» అదనపు కలెక్టర్ సుధీర్



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మూగజీవాలకు ఉత్తమ వైద్య సేవలందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. మంగళవారం జిల్లా పశుసంవర్ధక శాఖ పశువైద్యశాల కార్యాలయాన్ని, పశువుల దవాఖానాను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో పశువులకు వ్యాధులు ఎక్కువ వచ్చే ఆస్కారం ఉందని, అందువల్ల పశు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ గ్రామాల్లో పశువులకు వైద్యం అందించాలని సూచించారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. సమయ పాలన పాటించాలని, ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

మన ఊరు-మన బడి బిల్లులివ్వరా?

అప్పులపాలయ్యామని కాంట్రాక్టర్ల ఆందోళన



బషీరాబాద్ జెడ్పీ పాఠశాలలో ఆవరణలో అసంపూర్తిగా ఉన్న అదనపు గదుల నిర్మాణం

బషీరాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మన ఊరు-మనబడి కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాల గదుల మరమ్మతులు, అదనపు గదులు, డైనింగ్ హాల్స్ వంటివి నిర్మించాం. ఆ పనులకు సంబంధించి బిల్లులు చెల్లింపులో నెలల తరబడి తాత్సారం చేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్ ప్రాంతంలో మన ఊరు-మన బడి కింద చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపులు చేశారని, తమకు మాత్రం బిల్లులివ్వడం లేదని కాంట్రాక్టర్లు రవిప్రసాద్, మాజీ సర్పంచ్ లాలూ వాపోతున్నారు. బషీరాబాద్ మండలంలో ఎక్మాయి, బషీరాబాద్, జీవన్గి, నవాల్గ గ్రామాల్లో రెండేళ్ల కిందట పాఠశాలల్లో పనులు చేశానన్నారు. చేసిన పనుల మేరకు బిల్లులు రాక కొన్ని పనులు అసంపూర్తిగా నిలిచాయని కాంట్రాక్టర్లు వాపోయారు. ఈ పనులకు రూ.35లక్షల వరకు అప్పులు చేశామని కాంట్రాక్టర్ రవిప్రసాద్ తెలిపారు. బిల్లులు రాక ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నామని, కుటుంబాలను పోషించుకోలేపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పిచ్చిన వారు తీర్చాలని వెంటపడుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం


కంకర వేసి వదిలేసిన కొత్తపల్లి రోడ్డు మార్గం

చౌడాపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లికి వెళ్లే రోడ్డు అటవీశాఖ అభ్యంతరాలతో అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో కొత్తపల్లి మీదుగా వెళ్లే గ్రామాలకు రవాణా పరంగా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మూడు, నాలుగు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ రోడ్డు విషయమై కొత్తపల్లి గ్రామంలో అప్పటి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పర్యటనలో గ్రామస్థులు అడ్డుకున్నారు. బీటీరోడ్డు వేయించిన తర్వాతే గ్రామంలో పర్యటించాలని తిప్పి పంపించారు. దీంతో అప్పట్లో రోడ్డు పనులను ప్రారంభించారు. అయితే ఎన్నికల కోడ్ కారణంగా పనులు మళ్లీ ఆగిపోయాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి పనులను ప్రారంభించినా అటవీ శాఖ అధికారుల అభ్యంతరాలతో పనులు మరోమారు నిలిచిపోయాయి. ఇప్పటికైనా రోడ్డు పనులను ప్రారంభించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సిండి 'కేటుగాళ్లు'!

(ఐదో పేజీ తరువాయి)


సామర్థ్యానికి మించిన ఇసుకతో లారీ(ఫైల్)

కూడా దిగారంటే ఏ స్థాయిలో ఇసుక దందా నడుస్తోందో అర్థమవుతుంది. తమ ఇసుక తప్ప, ఇతరుల ఇసుకను కొనరాదన్న నేపథ్యంలో వార ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులే తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఇతర జిల్లాల నుంచి..

స్థానికంగా జిల్లాలో బొంరాసిపేట్, యాలాల ప్రాంతాల్లో ఇసుక వనరులు ఉన్నాయి. ప్రభుత్వ పనులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం స్థానిక ఇసుక తవ్వకాలకు అనుమతి ఇస్తున్నారు. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాల కోసం కొన్ని నెలల నుంచి యాలాల మండలంలోని వాగుల నుంచి ఇసుక తీసుకునేందుకు నిబంధనలను కొంత సులభతరం చేసింది. ఇదే అదునుగా వ్యాపారులు భారీగా వ్యాపారాన్ని చేస్తున్నారు. ఈ ఇసుకనే కాకుండా కరీంనగర్, పెద్దపల్లి, మల్లారం, మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌సాగర్, కోస్గీ ప్రాంతాల నుంచి సైతం పరిగికి ఇసుకను దిగుమతి చేసుకుంటున్నారు. ఒక్క లారీ వే బిల్లుతో తీసుకవస్తే మరో రెండు లారీల ఇసుకను స్థానికంగా తీసుకొచ్చి దొడ్డిదారిన అమ్ముకుంటున్నారు.

ఎంత చెబితే అంతే ధర

ఇసుక అక్రమ రవాణాలో దొరికితే దొంగ, లేదంటే దొరలానే తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఇళ్ల ఇతర నిర్మాణ పనులకు చేపట్టే వారికి ఇసుక తీసుకరావడానికి ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని చెబుతూ ధరను అమాంతం పెంచుతున్నారు. డిమాండ్ లేకున్నా కృత్రిమ కొరత సృష్టించి దండుకుంటున్నారు. పరిస్థితులు అవసరాన్ని, నాణ్యతను బట్టి నెల క్రితం టన్ను ఇసుక ధర రూ.1,300 నుంచి రూ.1,500ల వరకు ఉండేది. ఇప్పుడు రూ.2,200 నుంచి రూ.2,800 చొప్పున విక్రయిస్తున్నారు. ఇసుక తీసుకరావడం కష్టంగానే ఉందని భావిస్తున్న నిర్మాణదారులు ఎంత ధర చెప్పినా కొనుగోళ్లు చేస్తున్నారు.

భారీగానే మాముళ్లు

పరిగి ప్రాంతంలో ఇసుక మాఫియా ద్వారా కొందరు అధికారులకు లక్షల రూపాయాలు అందుతున్నాయన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. రెండు, మూడు శాఖల అధికారుల భాగస్వాములవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు రెవెన్యూ, మైనింగ్, కిందిస్థాయి పోలీస్ సిబ్బంది అయితే ఏకంగా ఇసుక లారీలు వచ్చే సమయానికి రహస్య ప్రాంతానికి వెళ్లి డబ్బులు వసూలు చేసుకుంటున్నారని తెలుస్తోంది. రెగ్యులర్‌గా నడిచే వ్యాపారుల వద్ద ఒక్కో ట్రాక్టర్‌కు నెలకు రూ.10 నుంచి రూ.20 వేల వరకు మాముళ్లు వసూలు చేస్తున్నట్లు సమాచారం. లారీలకు అయితే రెట్టింపు తీసుకుంటున్నారు. కొత్తగా వచ్చిన లారీలు, ట్రాక్టర్లు పట్టుబడితే సుమారు రూ.30 వేల వరకు వసూలు చేసుకొని వదిలేస్తున్నారని సమాచారం.

క్రైం కార్నర్

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


హరికృష్ణ(ఫైల్)

పూడూరు, ఆగస్టు 5, (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం అస్తేపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పూడూరు మండలం ఎన్కెపల్లి గ్రామానికి చెందిన కిష్టం హరికృష్ణ(35) అస్థిపురం గ్రామంలో తమకున్న పొలంలో మంగళవారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు పలుమార్లు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో పొలానికి వెళ్లి చూడగా హరికృష్ణ చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. స్థానికులతో కలిసి మృతదేహాన్ని నివాసానికి తరలించారు. అప్పుల బాధతోనే హరికృష్ణ ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. హరికృష్ణ గతంలో కారు కొనుగోలు చేశాడని, ప్రస్తుతం ఆటో కొని వ్యవసాయ కూలీలను తరలిస్తుండేవాడని స్థానికులు తెలిపాడు. మృతుడికి భార్య, రెండేళ్ల పాప ఉన్నారు.

చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం


రవికాంత్ మృతదేహం

మూడుచింతలపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):శామీర్‌పేట్ చెరువులో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. శామీర్‌పేట్ చెరువుఒడ్డున వ్యక్తి మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతిచెందిన వ్యక్తి బొల్లారంనకు చెందిన రవికాంత్(38)గా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోడి కోసం గొడవ.. వ్యక్తిపై దాడి

- ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు

ధారూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కోడి కోసం జరిగిన గొడవలో ఓవ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ ఘటన మండలంలోని రాంపూర్ తండాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాంపూర్ తండాకు చెందిన సబావత్ మోహన్‌కు చెందిన కోడి ఈనెల 1వ తేదీన అదే తండాకు చెందిన శంకర్ ఇంటి వైపు వెళ్లింది. ఆ తర్వాత కోడి కనిపించకపోవడంతో ఆ కోడిని శంకర్ చంపేశాడని అనుమానించిన మోహన్ అతడితో గొడవకు దిగాడు. మాటామాటా పెరగడంతో శంకర్ గొడ్డలితో, ఆయనభార్య సబావత్ లక్ష్మీబాయి ఊదుడు గొట్టంతో మోహన్‌పై దాడికి దిగారు. ఈ క్రమంలో శంకర్ కుమారుడు రాజేశ్ రోకలితో మోహన్ తలపై కొట్టాడు. ఈదాడిలో తీవ్రగాయాలపాలైన మోహన్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో అతడి కుటుంబసభ్యులు వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. మోహన్ భార్య పార్వతి బాయి ఫిర్యాదు మేరకు విచారణ జరిపారు. దాడికి పాల్పడిన సబావత్ రాజేష్, సబావత్ శంకర్, సబావత్ లక్ష్మీబాయిలపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాఘవేందర్ తెలిపారు. మంగళవారం వీరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు


తాండూరు: అరుణాచలేశ్వరున్ని దర్శించుకున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి దంపతులు


తాండూరు: సీతారాంపేట్ ఆంజనేయ స్వామి దేవాలయంలో కేక్ కట్ చేస్తున్న చైర్మన్ భీమలింగం

తాండూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశారు. బుయ్యని మనోహర్‌రెడ్డి దంపతులు తమిళనాడులోని అరుణాచలేశ్వరున్ని దర్శించుకొని గిరి ప్రదర్శన చేశారు. తిరచనూరు, పద్మావతి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలను నిర్వహించారు. తాండూరు పట్టణంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు హబీబ్‌లాల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. తాండూరు పట్టణంలో రక్తదాన శిబిరం, పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. భద్రేశ్వర దేవాలయంలో రెనవేషన్ కమిటీ అధ్యక్షుడు పటేల్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో దేవాలయ కమిటీ సభ్యులు జన్మదిన వేడుకలను నిర్వహించి ఆలయంలో అర్చనలు, ప్రత్యేకపూజలతో పాటు దాసోహం మందిరంలో అన్నదానం చేశారు. సీతారంపేట ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ డి.భీమలింగం ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించి కేక్ కట్‌చేశారు. భక్తులకు స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిండెంట్ శ్రీనివాస్, డైరెక్టర్లు ఎం.నర్సింహులు, బి.మంజుల, నారా శ్రీకాంత్, నారా అశోక్, పరమేశ్, వెంకట్, సత్యమూర్తి పాల్గొన్నారు. పట్టణ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు గాజుల మాధవి కమలాకర్ ఆధ్వర్యంలో కాళికా ఆలయం వద్ద అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బస్వరాజ్, కౌన్సిలర్ ప్రభావతి పాల్గొన్నారు. అదేవిధంగా తాండూరు మండలంలోని గౌతాపూర్, కొత్లాపూర్ తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గౌతాపూర్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు జెర్నె నాగప్ప ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బషీరాబాద్: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలను బషీరాబాద్ మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింహులు గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దేముల్: ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా మండల కేంద్రమైన పెద్దేముల్‌లో ఎంఎన్ఆర్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ నేతృత్వంలో ఎల్ఎన్ఆర్ యువసేన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కేక్ కట్ చేయించి వేడుకలు జరుపుకున్నారు.

యాలాల: ఎమ్మెల్యే జన్మదిన సందర్భంగా మండలంలోని దేవనూరు గ్రామంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రఫిక్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఖాసీం, ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


బషీరాబాద్: కేక్ కట్‌చేస్తున్న మండల నాయకులు అజయ్ ప్రసాద్, తదితరులు


పెద్దేముల్: కేక్ కట్ చేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్

కాళేశ్వరంతో రాష్ట్రం సస్యశ్యామలం: మాజీ ఎమ్మెల్యే

వికారాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంతో రాష్ట్రం సస్యశామలం అవుతుందని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. వికారాబాద్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ భవన్ నుంచి కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రత్యక్ష ప్రసారాన్ని ఇవ్వగా స్క్రీన్ ఏర్పాటు చేసి వీక్షించారు. రానున్న రోజుల్లో మళ్లీ రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ప్రతి ఎకరాకు నీరు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

కట్టు కాల్వ మరమ్మతులు చేపట్టాలి

కొడంగల్ రూరల్, అగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కొడంగల్ పెద్దచెరువులోకి నీరు వచ్చే కట్టు కాల్వ మరమ్మతుకు అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ రెండోవార్డు మాజీకౌన్సిలర్ మధుసూదన్ యాదవ్ అన్నారు. కొడంగల్ శివారులో కొనసాగుతున్న బైపాస్‌రోడ్డు పనులతో పూడుకుపోయిన కాల్వను రైతులు బండి గోపాల్, పాశం వెంకటయ్య, చింతకాయల బాలయ్య, శివ, పాశం వెంకటప్ప, రాములతో కలిసి మంగళవారం పరిశీలించారు.

ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలి

నవాబుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో అబ్దుల్ రహెమాన్ అన్నారు. ప్రాథమిక పాఠశాలలో భవిత కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఫిజియోథెరపీ శిబిరాన్ని ఆయన పరిశీలించారు. దివ్యాంగ చిన్నారులకు ఐఈఆర్‌పీ మురళీతో ఫిజియోథెరపీ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చాణక్య, స్పెషల్ ఎడ్యూకేటర్ వీరమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగంలో బదిలీలు సహజం


ఏపీఎంకు సన్మానిస్తున్న సిబ్బంది

బంట్వారం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగంలో బదిలీలు సహజం అని మండల సమాఖ్య అధ్యక్షురాలు భ్రమరాంబ అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు, ఆహ్వాన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో మొదటి స్థానంలో బంట్వారం మండల సమాఖ్య నిలవడానికి ఏపీయం దేవయ్య ఎంతో కృషి చేసారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటేశ్వర రావు, కంసమ్మ, వీరమణి పాల్గొన్నారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ

దుద్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 14వ విడత జాతీయ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ మంగళవారం ప్రారంభమైంది. గత సంవత్సరం 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు గ్రామాల్లో జరిగిన వివిధ రాకల పనులకు సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు బ్లాక్ రీసోర్స్ పర్సన్ రామమూర్తి తెలిపారు. ఈనెల 8 వరకు తనిఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌పీలు సునీత, సౌజన్య, శివలీల పాల్గొన్నారు.

కళాకారులకు అవార్డులు

బొంరాస్‌పేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):నాందర్‌పూర్ గ్రామానికి చెందిన అన్నదమ్ములు ఒగ్గు బీరప్పకు అఖండ భారత్ కళారత్న, ఒగ్గు శివకు పద్మ జ్యోతి అవార్డులు వరించాయి. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ఎన్నో ప్రదర్శనలు నిర్వహించి ఎంతో మంది యువతకు ఒగ్గుడోలు శిక్షణ ఇవ్వడంతో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంగళవారం అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి


కొడంగల్: ఉల్లాస్ శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈవో రాంరెడ్డి

కొడంగల్/దోమ/బషీరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంఈవో రాంరెడ్డి అన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 10 మందికి ఒక వలంటీర్‌గా మహిళా సంఘం సభ్యురాలు మహిళలకు కనీసం చదవడం, సంతకం చేయడం నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయం వెంకయ్య పాల్గొన్నారు. అదేవిధంగా దోమ ఎంపీడీవో కార్యాలయంలో వీవోఏలకు ఉల్లాస్ ఒక్కరోజు వర్క్‌షాప్ శిక్షణను ఎంఈవో వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతనంగా ఏపీఎంగా బాధ్యతలు చేపట్టిన శోభను కార్యాలయ సిబ్బంది శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గ్యమా నాయక్, ఏపీయం శోభ పాల్గొన్నారు. బషీరాబాద్‌లో ఎంఈవో రాములు ఐకేపీ సిబ్బందికి ఐకేపీ సిబ్బందికి ఆన్‌లైన్ యాప్ ద్వారా నిరక్షరాస్యుల నమోదు చేసే విధానంపై అవగాహన కల్పించారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం


చండీ హోమంలో భక్తులు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ కొర్రెములలోని శ్రీ మహంకాళి సమేత బ్రహ్మసూత్ర నీలకంఠ స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం ఘనంగా చండీ హోమం నిర్వహించారు. ఉదయం రుద్రాభిషేకం, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు.మాజీ సర్పంచ్ ఒరుగంటి కవితావెంకటేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ దంపతులు బొడ్డు వనజానాగార్జున, మాజీ ఉపసర్పంచ్ దంపతులు కందుల రాజు తదితరులు పాల్గొని పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గరాజుగౌడ్, ఆంజనేయులుగౌడ్, భాస్కర్, రవికుమార్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేదిలేదు


అక్రమ నిర్మాణాలను సీజ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

శామీర్‌పేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సీజ్‌చేసిన తర్వాత కూడా అక్రమ నిర్మాణాలను మళ్లీ నిర్మించినట్లైతే ఏమాత్రం ఉపేక్షించేదిలేదని మున్సిపల్ కమిషనర్ జ్యోతి హెచ్చరించారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని ఎంఎం రెడ్డి కాలనీలో గల విజన్ స్కూల్ భవనాన్ని, వెంకటేశ్వర కాలనీల్లో రెండుచోట్ల అనుమతులు లేని నిర్మాణాలకు నోటీసులు అందజేయగా యధేచ్ఛగా నిర్మాణాలు కొనసాగిస్తుండటంతో ఆ భవనాలను సీజ్ చేశారు. స్థానిక ప్రజల పిర్యాదుల మేరకు మంగళవారం తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీధర్, వార్డు ఆఫీసర్లు తూంకుంట మున్సిపల్ పరిధిలోని నూతనంగా పెద్దఎత్తున నిర్మిస్తున్న విజన్ స్కూల్ భవనాన్ని, వెంకటేశ్వర కాలనీల్లో నిర్మాణాలను జరుపుతున్న రెండు నూతన భవనాలను సీజ్ చేసి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలుంటాయన్నారు.

ఎరువులను అందుబాటులో ఉంచాలి


ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న ఏడీఏ లక్ష్మీకుమారి

కులకచర్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో రైతులకు కావాల్సిన యూరియా, డీఏపీ ఎరువులను అందుబాటులో ఉంచాలని పరిగి ఏడీఏ లక్ష్మీ కుమారి అన్నారు. మంగళవారం కులకచర్లలో పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సాయమందిస్తా

ఘట్‌కేసర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని చౌదరిగూడ రేణుక ఎల్లమ్మ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తనవంతుగా సాయమందిస్తానని ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. రేణుక ఎల్లమ్మకాలనీలో కమ్యూనిటీహాల్‌కు సంబంధించిన స్థలం అన్యాక్రాంతం అవుతోందని కాలనీవాసులు తెలపడంతో స్పందించి మంగళవారం రెండువర్గాలతో చర్చించి వెంటనే భూమిపూజ నిర్వహించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

దుద్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని దుద్యాల ఎస్‌ఐ యాదగిరి అన్నారు. మండల కేంద్రంలో పోలీసు సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో నంబర్ ప్లేట్‌లేని ఆరుగురు వాహనదారులకు జరిమానాలు విధించినట్లు తెలిపారు.

కొబ్బరి కాయల విక్రయానికి వేలం

కులకచర్ల: బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వర స్వామి చిన్న జాతర ఉత్సవాలు ప్రతీ సంవత్సరం శ్రావణ మాసం చివరి సోమవారం జరుగుతాయి. ఈ సందర్భంగా కొబ్బరికాయల విక్రయానికి మంగళవారం వేలం నిర్వహించారు. వేలంలో అదే గ్రామానికి చెందిన బిచ్చయ్య రూ.2 లక్షల 10 వేలకు దక్కించుకున్నాడు.

ఉలిక్కిపడిన మేడ్చల్ మార్కెట్

(ఐదో పేజీ తరువాయి)

శిథిలాల కింద మరి కొందరు ఉండవచ్చన్న అనుమానంతో వాటిని తొలగించి చూడగా ఎవరు లేక పోవడంతో పోలీసులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

దుకాణాలు మూసివేసి ఇళ్లకు వెళ్దామనుకుంటే..

కొనుగోలుదారులతో కిటకిటలాడే మేడ్చల్ ప్రధాన మార్కెట్‌లో ఈ ఘటన పగటి వేళ జరిగితే పెద్ద సంఖ్యలో ప్రాణ నష్టం వాటిల్లేదని స్థానిక వ్యాపారులు వాపోతున్నారు. రాత్రి 9:30 గంటల సమయంలో దుర్ఘటన చోటు చేసుకోవటంతో మార్కెట్‌లో అంతగా జనాలు లేరని స్థానికులు తెలిపారు. అప్పటికే మార్కెట్‌లోని కొన్ని దుకాణాలు మూసి వేశారు.

ప్రమాద తీవ్రతను అడ్డుకున్న బోరు డ్రిల్లర్ వాహనం

అక్కడున్న బోరు డ్రిల్లింగ్ చేసే వాహనం పేలుడు ఘటన తీవ్రతను అడ్డుకుందని స్థానికులు తెలిపారు. పేలడు సంభవించిన సమయంలో భవనం ముందు రోడ్డు మీద నుంచి ఆ వాహనం వెళ్తోంది. దీంతో శిథిలాలు మార్కెట్‌లోని ఇతర దుకాణాల వైపు దూసుకురాకుండా ఆ వాహనం అడ్డంగా నిలిచిందని స్థానికులు తెలిపారు. చాలావరకు శిథిలాలు బోరు డ్రిల్లింగ్ వాహనానికి తగిలి అక్కడే పడి పోయాని ఈ క్రమంలో వాహనంలో ఉన్న ఓ లేబర్ తలకు బలమైన గాయాలు కావడంతో అతన్ని ఆసుపత్రికి తరలించారు.

అంతా చూస్తుండగానే



అందరూ దుకాణాలు మూసి వేసి ఇంటికి వెళ్దామన్న క్రమంలో ఈ ఘటన చోటు చేసుకుంది. తన షాపు ఎదుటి భవనంలో ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో వణికి పోయాం. శిథిలాలు నేరుగా మా దుకాణం వద్ద ఎగిరి పడ్డాయి. ఘటన జరిగిన భవనానికి ఎదురుగా ఉన్న మొబైల్ షాపు పాక్షికంగా దెబ్బతిన్నది.

- రాము, మెడికల్ షాపు యజమాని

కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి


వికారాబాద్: కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందారెడ్డి

వికారాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందారెడ్డి అన్నారు. మండలంలోని రాళ్లచిట్టంపల్లి, మైలార్ దేవరంపల్లి గ్రామాల్లో బూత్ అధ్యక్షులు చారి, పాండురంగారెడ్డి, ఎంపీటీసీ ప్రభారీ బస్వలింగం ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికి బీజేపీ కార్యక్రమం ప్రారంభించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శివరాజ్ గౌడ్, పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ అమరేందర్ రెడ్డి, మల్లేశ్, ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పూడూరు: మండల కేంద్రంలో మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగా మంగళవారం పూడూరు మండల కేంద్రంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా ఎన్నికల ప్రభారీ జే.శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు కొప్పుల రాజశేఖర్‌రెడ్డి, సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్‌బోర్డు సభ్యులు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లేశ్‌పటేల్ ఇంటింటికి వెళ్లి ప్రధాని నరేంద్రమోదీ పాలనలో సాధించిన ప్రగతిని, చేపట్టిన అభివృద్ధి పనులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాఘవేందర్ పాల్గొన్నారు.

పెద్దేముల్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్‌కుమార్ మంగళవారం కందనెల్లి గ్రామంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సందీప్ కుమార్, శివరాజ్, నర్సింహా, నరేందర్ పాల్గొన్నారు.

పరిగి: మహాసంపర్క్ అభియాన్‌లో భాగంగా బీజేపీ నాయకులు మంగళవారం పరిగి పట్టణంలోని షిర్డీ సాయినగర్ కాలనీలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పార్టీ శక్తి కేంద్రం ఇన్‌చార్జి వార్ల ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో రాంచంద్రయ్య, బాలకృష్ణారెడ్డి, వాణి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం

కీసర: కీసరగుట్టలోని శ్రీమారుతీ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. గర్భాలయంలోని మూలవిరాట్‌కు శ్రీమహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు.

బాలికలకు చీరలు పంపిణీ

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధి కరీంగూడలోని ఓమౌజః ఆశ్రమంలో ఓమౌజయా విశ్వ మహిళా సేవా సమితి అధ్వర్యంలో మంగళవారం వెయ్యిమంది బాలికలకు చీరలు పంపిణీ చేశారు. అదే విధంగా మహిళలకు సారె, అన్నదానం నిర్వహించారు.

టీబీ నిర్ధారణ పరీక్షలు

దౌల్తాబాద్: టీబీ ముక్త భారత్ అభియాన్ శిబిరంలో భాగంగా గోకఫస్లాబాద్‌లోని ఆరోగ్య ఉపకేంద్రంలో మంగళవారం దౌల్తాబాద్ ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు అమూల్య ప్రియదర్శిని 182మందికి టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అందులో 22మందికి టీబీ లక్షణాలు గుర్తించి ఎక్స్‌రే నిమిత్తం కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కులకచర్ల: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక వైద్యాధికారి కిరణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆసుపత్రిలో జరిగిన ఆరోగ్య కార్యకర్తల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వాసుపత్రుల్లో అన్నీ రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామని, మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

నూతన ఏపీయంకు సన్మానం

కులకచర్ల: కులకచర్ల మండలంలో నూతన ఏపీయంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం స్థానిక సెర్ప్ కార్యాలయంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హబీబ్ అహ్మద్ పాల్గొన్నారు.

తపస్ సభ్యత్వ నమోదు

బొంరాస్‌పేట్: తపాస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల్లో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బాకారం మల్లయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

నవాబుపేట: మండలంలోని అక్నాపూర్ నుంచి నారేగూడకు రోడ్డు పనులను మంగళవారం మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

పరిగి: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని జిల్లా అధికారిణి కృష్ణవేణి, సీడీపీవో మెహరున్నీసాబేగం అన్నారు. రాగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉజ్వలరాణి పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నదానం

శామీర్‌పేట: శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం నిర్వాహకులు అన్నదానం చేపట్టారు. ఆలయంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉపాధిహామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడికి సన్మానం


నర్సింహులుగౌడ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

బొంరాస్‌పేట్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నర్సింహులుగౌడ్‌ను గ్రామస్తులు సన్మానించారు. మండలంలోని భూలక్ష్మమ్మ చౌరస్తాలో మంగళవారం రాత్రి ఆయనను పూలమాలలు, శాలువాలతో గ్రామస్తులు సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్న నర్సింహులుగౌడ్‌కు రాష్ట్ర ఉపాధిహామీ కౌన్సిల్ సభ్యుడిగా బాధ్యతలు అప్పగించడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రారెడ్డి, నర్సింహులు యాదవ్, కృష్ణ పాల్గొన్నారు.

హకీంపేట్‌లో భూసర్వే

దుద్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హకీంపేట్‌లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు భూసర్వే నిర్వహించారు. రెండు నెలల కిందట మండలంలోని పోలెపల్లి, పులిచర్ల కుంట, రోటిబండ తండా, లగచర్ల గ్రామాల్లోని రైతుల పొలాల్లో సర్వే నిర్వహించి వారికి నష్టపరిహారం అందజేశారు. కాగా, హకీంపేట్‌లోని రైతుల పొలాల్లో మంగళవారం సర్వే నిర్వహించారు. వీరికి త్వరలోనే నష్టపరిహారం అందించనున్నట్లు తహసీల్దార్ కిషన్‌నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సురేంద్రనాథ్ పాల్గొన్నారు.